
# రాబడి




# త్వరపడండి..వడ్డీరేటు 7.5%

## మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు సమీపిస్తున్న గడువు

**మహిళా** మదుపరుల కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చిన్నమొత్తాల పొదుపు పథకం.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ స్కీం.. వచ్చే ఏడాది మార్చి 31తో దూరం కానున్నది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దీని గడువును పెంచుతారని భావించినా అదేమీ జరుగలేదు. దాంతో ఆకర్షణీయ వడ్డీరేటును అందించే ఈ సర్టిఫికెట్.. మరెంతో కాలం కొనసాగని పరిస్థితి. అందుకే ఇప్పటికైనా ఇందులో పెట్టుబడులు పెట్టకపోతే ఆ దిశగా అడుగులు వేయాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారిప్పుడు.

**పెట్టుబడులు ఎలా?**

భారతీయ మహిళల్లో పొదుపు అలవాటును పెంపొందించేందుకు ఈ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌ను పరిచయం చేశారు. తపాలా శాఖ ఈ స్కీంలో పెట్టుబడులకు అవకాశాన్ని కల్పిస్తున్నది. అలాగే ఈ పథకాన్ని వీలైనంత ఎక్కువ మహిళలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వ రంగ బ్యాంకులు, కొన్ని ప్రైవేట్ రంగ బ్యాంకులకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిరుడు సూచనలు చేసింది. ఈ క్రమంలోనే బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బ్యాంకులూ ఈ స్కీంను అమలు చేస్తున్నాయి.

**ఎవరు అర్హులు?**

దేశంలోని మహిళలందరికీ ఇందులో పెట్టుబడి పెట్టేందుకు వీలున్నది. అలాగే మైనారిటీ తీరని తమ ఆడపిల్లల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులు కూడా ఈ స్కీంను తీసుకోవచ్చు. దీని కాలపరిమితి రెండేండ్లు. గరిష్ఠంగా రూ.2 లక్షలదాకా పెట్టుబడిగా పెట్టవచ్చు. దీనిపై వార్షిక వడ్డీరేటు 7.5 శాతంగా ఉన్నది. ఇది మారదు. ప్రతీ 3 నెలలకోసారి లెక్కించి ఖాతాలో జమ చేస్తారు. ఖాతా కాలపరిమితి తీరినప్పుడు చెల్లిస్తారు. అయితే ఖాతా తెరిచిన ఏడాది తర్వాత అవసరాలనుబట్టి పెట్టుబడిగా పెట్టిన దాంట్లో 40 శాతం వరకు ఉపసంహరించుకోవడానికి వెసులుబాటు కూడా ఉన్నది.

**ఖాతాను ముందుగా మూసేయవచ్చా?**

ఖాతాను తెరిస్తే రెండేండ్లపాటు కొనసాగించాల్సిందే. అయితే ఖాతాదారు చనిపోతే లేదా ఖాతాదారు, మైనర్ల సంరక్షకుడు ప్రాణాంతక వ్యాధి బారినపడితే మూసేందుకు అవకాశాన్నిస్తారు. అలాగే నిబంధనలకు లోబడి వడ్డీరేట్లను చెల్లిస్తారు. ఇక కాల పరిమితి తీరిన ఖాతాల నుంచి నగదు ఉపసంహరణకు ఫామ్-2ను సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఖాతాను తెరిచేందుకు బ్యాంక్ ఫారం, ఆధార్, పాన్ తదితర కేవైసీ ధ్రువపత్రాలు మొదలగునవి అవసరం. మరిన్ని వివరాలకు మీ దగ్గర్లోని బ్యాంక్ శాఖ లేదా పోస్టాఫీస్‌ను సంప్రదించవచ్చు.

## మైనర్ల కోసం ఎన్‌పీఎస్ వాత్సల్య

**ఇటీవలి** కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో భాగంగా 'వాత్సల్య' పేరుతో ఓ కొత్త పథకాన్ని పరిచయం చేశారు. చిన్నారుల కోసం తెచ్చిన దీర్ఘకాలిక సేవింగ్స్ స్కీం ఇది. ఈ మైనర్ పెన్షన్ స్కీంలో తమ పిల్లల కోసం తల్లిదండ్రులు లేదా వారి సంరక్షకులు చేరవచ్చు. దీంతో భవిష్యత్తులో పిల్లలకు ఆర్థిక భద్రతను కల్పించినట్టవుతుంది. పిల్లలకు 18 ఏండ్లు వచ్చాక, ఈ వాత్సల్య పథకాన్ని రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాగా కూడా మార్చుకోవచ్చు. భారతీయులతోపాటు ప్రవాస భారతీయులు తమ పిల్లల కోసం ఈ స్కీంను తీసుకోవచ్చు. అధికారిక ఈఎన్‌పీఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నది. దీనికి ప్రీమియంలు ఆయా బ్యాంకుల ద్వారా చేసుకునే సౌలభ్యం ఉంటుందంటున్నారు.

# ఆచితూచి అడుగులు..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు గత వారం ఎక్కువ రోజులు నష్టాలకే పరిమితమయ్యాయి. అయితే వరుస పతనాలతో డీలాపడిన సూచీలను ఆఖర్లో లాభాలు ముంచెత్తాయి. చివరిరోజు శుక్రవారం భారీగా పెరిగాయి. మదుపరులు లాభాల స్వీకరణ నుంచి పెట్టుబడుల దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా చెప్పుకోదగ్గ లాభాలనే గత వారం మార్కెట్లు అందుకున్నాయి. అంతకు ముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 728.07 పాయింట్లు లేదా 0.90 శాతం పెరిగి 81,332.72 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 303.95 పాయింట్లు లేదా 1.23 శాతం అందుకుని 24,834.85 దగ్గర ముగిసింది. ఈ క్రమంలో ఈ వారం మదుపరులు ఆచితూచి అడుగులు వేయవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక బడ్జెట్ నిర్ణయాల ప్రభావం, ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. అయితే సూచీలు రికార్డు స్థాయి దరిదాపుల్లో ఉన్నందున పెట్టుబడులు-ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకూ అవకాశాలు లేకపోలేదు. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,100-25,300 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.







## ఆరోగ్య బీమాలో ఈ తప్పులు వద్దు

**చాలామందికి** ఆరోగ్య బీమా క్లెయిములు తిరస్కరణకు గురవుతుండటాన్ని చూస్తూనే ఉంటాం. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ రిజెక్ట్ కావడం వెనుక ప్రధానంగా ఈ పొరపాట్లు కనిపిస్తున్నాయి. కాబట్టి మీరు మాత్రం ఇలా చేయవద్దు. మొదట క్లెయిమ్ ఫామ్‌లో తప్పుడు సమాచారాన్ని ఇవ్వరాదు. వయసు, పేరు, ఫోన్ నెంబర్ సరైనవే ఇవ్వాలి. అలాగే ఇప్పటికే మీకున్న ఆరోగ్య సమస్యలను దాచకండి. వెయిటింగ్ పీరియడ్‌లో క్లెయిమ్ చేయవద్దు. రెగ్యులర్‌గా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలను చెల్లిస్తూపోండి. క్లెయిమ్ చేయడాన్ని ఆలస్యం చేయవద్దు. అవసరమైన అన్ని డాక్యుమెంట్లను అందివ్వండి. ప్రతీ చిన్న సమస్యకూ క్లెయిమ్ చేసేదాకా పరిస్థితిని తెచ్చుకోవద్దు. ఒక సమస్యకు చికిత్స తీసుకొని, మరో సమస్యకు ట్రీట్‌మెంట్ తీసుకున్నట్టు చెప్పకండి. అయితే కొన్నిసార్లు పాలసీ నిబంధనలు మారడం వల్ల, బీమా సంస్థ/థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ వల్ల కూడా క్లెయిముల తిరస్కరణ జరుగవచ్చు.

# నీ ఇల్లు బంగారంగానూ..

## పసిడిపై పెట్టుబడికి 6 మార్గాలు



**బంగారం..** తరాలు మారినా వన్నె తగ్గని సంపద. అందుకే అప్పుడు, ఇప్పుడు, ఎప్పటికీ కూడా పుత్తడిపై అందరికీ అంత మక్కువ. అయితే ఒకప్పటితో పోల్చితే నేడు పసిడిని చూసే వైఖరి మారింది. ముఖ్యంగా నేటి తరం దాన్ని కేవలం ఆభరణంగా మాత్రమేగాక, ఓ తెలివైన పెట్టుబడి సాధనంగా చూస్తున్నది.

**ధరలు తగ్గుతున్న తరుణంలో..**

ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారంపై కనీస కస్టమ్స్ సుంకాన్ని తగ్గించిన విషయం తెలిసిందే. 10 శాతం నుంచి 6 శాతానికి తెచ్చారు. ఈ నేపథ్యంలో గోల్డ్ రేట్లు క్రమేణా దిగొస్తున్నాయి. బడ్జెట్‌కు ముందు రికార్డు స్థాయిలో పరుగులు పెట్టిన పుత్తడి ధరలు.. ఇప్పుడు రివర్స్‌గేర్‌లో నడుస్తున్నాయి. గడిచిన నాలుగైదు రోజుల్లో తులం రూ.5-6 వేలు తగ్గింది మరి. ఇప్పటికే 24 క్యారెట్ ధర రూ.70 వేల దిగువకు, 22 క్యారెట్ రేటు రూ.63 వేల దరిదాపుల్లోకి వచ్చింది. అయితే ధరలు ఇంకా తగ్గుతాయన్న అంచనాల నడుమ ఇన్వెస్టర్లు అతిగా వేచిచూసే ధోరణిని అవలంభించవద్దని నిపుణులు సూచిస్తున్నారు. వీలున్నంత మేర కొనుగోళ్లకు దిగడమే ఉత్తమమన్న అభిప్రాయాలనూ కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే వివిధ రకాల పెట్టుబడి సాధనాలను పరిశీలించాలని సలహా ఇస్తున్నారు. నిజానికి బంగారం.. భౌతిక రూపం నుంచి కాగితం, వర్చువల్ రూపానికీ మారిందిప్పుడు. అసలు బంగారంపై పెట్టుబడికున్న మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే..

**ఆభరణాలు**

ఎప్పట్నుంచో పుత్తడి అంటే గుర్తొచ్చేది నగలే. కాబట్టి బంగారంపై పెట్టుబడి పెట్టాలనే కోరిక ఉన్నవారు ఆభరణాల కొనుగోళ్లతోనూ ముందుకెళ్లవచ్చు. అయితే హాల్‌మార్క్‌తోపాటు తయారీ, తరుగు, ఇతరత్రా ఖర్చులన్నింటినీ చూసుకొని కొనడం వల్ల లాభాలను పెంచుకోవచ్చు. కానీ నగ డిజైన్‌నుబట్టి కూడా దాని ధర మారుతుందన్న విషయాన్ని మర్చిపోకూడదు.

**నాణేలు**

గోల్డ్ కాయిన్స్ కూడా పెట్టుబడికి అనువైనవే. నగల వర్తకులు, బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, చివరకు ఈ-కామర్స్ సంస్థలూ అమ్ముతున్నాయి. గోల్డ్ కాయిన్లు, కడ్డీలు 24 క్యారెట్, 99.9 స్వచ్ఛతతో ఉంటాయి. అన్ని నాణేలు, కడ్డీలపై బీఐఎస్ ప్రమాణాలతో కూడిన హాల్‌మార్క్ ఉంటుంది. నకిలీ, మోసం, డ్యామేజీకి తావు లేకుండా ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్‌తో ఉన్న నాణేలను కొనాలి. అర గ్రాము నుంచి 5 తులాలదాకా బరువున్న నాణేలు దొరుకుతాయి. మీ వీలును బట్టి కొనవచ్చు.

**గోల్డ్ సేవింగ్స్ స్కీమ్స్**

గత కొన్నేండ్లుగా చాలామంది జ్యుయెల్లర్స్ గోల్డ్ సేవింగ్స్ స్కీములను తెస్తున్నారు. ప్రతీ నెలా కొంత మేర నగదును మీరు సదరు వ్యాపారి వద్ద డిపాజిట్ చేస్తే.. నిర్ణీత కాల పరిమితి తర్వాత దానికి సమాన విలువైన బంగారాన్ని తీసుకోవచ్చు. నగదు ప్రోత్సాహకాలు, బహుమతుల రూపేణా కూడా వ్యాపారులు ఇస్తున్నారు. పేరున్న సంస్థల్లో ఈ స్కీములను పరిశీలించి ఓ నిర్ణయం తీసుకోవచ్చు.

**గోల్డ్ ఈటీఎఫ్‌లు**

గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌నే గోల్డ్ ఈటీఎఫ్‌లుగా పిలుస్తున్నారు. ఈ లావాదేవీలు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో ప్రధానంగా జరుగుతాయి. సిప్‌లు, స్టాక్ బ్రోకర్లు, డీమ్యాట్ ఖాతాల ద్వారా ట్రేడింగ్‌కు, పెట్టుబడులకు దిగవచ్చు. కనీసం 1 గ్రాము పెట్టుబడిగా పెట్టాలి.

**సావరిన్ గోల్డ్ బాండ్లు**

సావరిన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ)ను ప్రభుత్వం జారీ చేస్తుంది. కాబట్టి వీటిని సురక్షిత పెట్టుబడులుగానే పరిగణించవచ్చు.

**డిజిటల్ గోల్డ్**

ఇన్వెస్టర్లు డిజిటల్ గోల్డ్‌నూ పరిశీలించవచ్చు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్‌ల ద్వారా కొనవచ్చు. ఎంఎంటీసీ, పీఏఎంపీలతో ఇవి టైఅప్ అయ్యి ఉంటాయి.